క్లుప్తంగా

తాంసి పాఠశాలకు టీచర్

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండలంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో భీంపూర్ మండలంలోని అర్లి(టి)లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు శ్యామలకు సోమవారం డిప్యూటేషన్ విధులు కేటాయించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఈ పాఠశాలలో సస్పెండ్‌కు గురైన ఉపాధ్యాయు డి స్థానంలో నియమించినట్లు తెలిపారు.

వాచ్‌మెన్, కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్, హాస్టల్‌లో పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వాచ్‌మెన్ 1, హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్హత ఉండాలని, వంట చేయడంలో అనుభవం, గతంలో హాస్టల్, మధ్యాహ్నం భోజనం వండినట్లు ధ్రువపత్రం జత చేయాలని సూచించారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి అర్హత ఉండాలని పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలు మధ్య గలవారు ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. ఈనెల 14లోగా ఆదిలాబాద్ ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు.

విద్యార్థినులను వేధిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఇచ్చోడ: విద్యార్థినులను వేధిస్తే చర్యలు తప్పవని షీటీం సభ్యులు వాణిశ్రీ, రోహిని, మోహన్, మహేశ్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యాలయ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బస్టాండ్ ఇతర రద్దీ ప్రదేశాల్లో విద్యార్థినులపై తప్పుగా ప్రవర్తిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్యాంరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్



పర్స్ అందజేస్తున్న సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బస్టాండ్ వద్ద బస్సులో మహిళా ప్రయాణికురాలు పర్స్ పోగొట్టుకోగా గమనించిన కండక్టర్ రమణ సోమవారం డిపో కానిస్టేబుల్‌కు అప్పగించారు. పర్సులో 3 తులాల బంగారం, రూ. 2000 ఉన్నాయి. ఆ పర్సును ప్రయాణికురాలికి అందచేసి కండక్టర్ నిజాయతీ చాటుకున్నాడు. ఉట్నూర్ డిపో కానిస్టేబుల్ కె.దిలీప్ కుమార్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

నేడు జిల్లా సీనియర్ బేస్‌బాల్ జట్టు ఎంపిక

ఆదిలాబాద్: జిల్లా బేస్ బాల్ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ మహిళల– పురుషుల ఎంపిక కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కల్లాల శ్రీనివాస్, పందిరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని పేర్కొన్నారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన లాండే సందీప్ అనే డీజే నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. ఆయన వివాహం సందర్భంగా కాలనీలో అర్ధరాత్రి వరకు భారీ శబ్దంతో డీజే సౌండ్ ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసినట్లు పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగడంతో కాలనీవాసులు డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో ఎస్సై విష్ణుప్రకాష్ సంఘటన స్థలానికి చేరుకొని ఎంప్లిఫైర్, డీజే సౌండ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మర్‌వాడకు చెందిన పుట్ట ఉమ ఈనెల 8న ఉదయం 6 గంటలకు పనికి వెళ్తానని చెప్పి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె అన్నకు ఫోన్ చేసి తెలియజేశారు. దీంతో అన్న రుద్రవేణి అశోక్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పండుగ పూట.. పస్తులుండకుండా..

- రాఖీ సందర్భంగా ఉద్యోగులకు భోజనం
- ఆర్టీసీ సంస్థ వినూత్న కార్యక్రమం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



ఉద్యోగులకు ఆహార ప్యాకెట్లు అందిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్: పండుగలు ఏవైనా ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి దర్శనమిస్తుంటాయి. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ప్రారంభం కావడంతో మహిళలతో బస్సులు నిండిపోతున్నాయి. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఓఆర్ పర్వదినాల సమయంలో 100కు మించిపోతుంది. దీంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుండడంతో ఆర్టీసీ కండక్టర్లు శారీరకంగా అలసటకు గురవుతున్నారు. రోజువారి సాధారణ డ్యూటీతో పోలిస్తే పండుగ సమయాల్లో ట్రాఫిక్ కారణంగా నిస్సత్తువకు లోనవుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ వినూత్న కార్యక్రమం ప్రారంభించింది. రాఖీ పండుగ సమయంలో విధులు నిర్వహించిన కండక్టర్లు, డ్రైవర్లకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ప్రయాణికుల తాకిడితో ఒత్తిడి..

సాధారణ పని దినాల్లో ప్రయాణికుల తాకిడి ఉంటుంది. వీకెండ్స్, పండుగలు సమయాల్లో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో కండక్టర్లు, డ్రైవర్లపై పని భారం పెరుగుతుంది. పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్లే బస్సుల్లో కండక్టర్లకు టికెట్లు ఇవ్వడం ఇబ్బందికరంగా మారుతుంది. మరోవైపు బస్సును ఆపరేట్ చేయడం విషయంలో సైతం డ్రైవర్లకు సమస్యలు ఎదురవుతుంటాయి. దీంతో వారు అలసటకు గురవుతుంటారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం వారిని ప్రోత్సహించేందుకు ఆదిలాబాద్ రీజియన్ వ్యాప్తంగా ప్రతీ ఆర్టీసీ బస్టాండ్‌లో మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని రాఖీ పండుగ రోజు ఏర్పాటు చేసింది. దూర ప్రాంతాలకు బస్సులు నడిపే ఉద్యోగులకు ఆహార ప్యాకెట్లను అందించింది. అదే విధంగా సోమవారం సైతం వారికి అరటిపండ్లతో పాటు కూల్‌డ్రింక్స్ అందజేశారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, వారి ఆరోగ్యం సంక్షేమాన్ని సైతం దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలుపుతున్నారు.

మంచి నిర్ణయం..



ఉద్యోగుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం వలన డ్యూటీ కూడా ఇబ్బంది లేకుండా చేయవచ్చు. ముఖ్యంగా పండుగ సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో తీవ్రమైన అలసటకు గురవుతాం. పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో తినాలనే ఆలోచన కూడా కలగదు. మా సమస్యను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం మంచి నిర్ణయం తీసుకుంది.

– వనిత, కండక్టర్

ఆహారం అందించడం హర్షణీయం



రాఖీ సమయంలో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా మహిళ ప్రయాణికుల తాకిడి చాలా ఎక్కువగా ఉంటుంది. టికెట్లు జారీ చేయడం సవాలుతో కూడుకొని ఉంటుంది. దీంతో శారీరకంగా ఎంతో అలసిపోతాం. మా సమస్యను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం ఆహార ప్యాకెట్లను అందించడం హర్షణీయం.

– ఎస్కే. హైదర్, కండక్టర్

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామలో అంగన్‌వాడీ భవనం ప్రారంభించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో సేంద్రియ ఎరువులతో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం కామాగిరిలో మహిళా సమైఖ్య భవనం ప్రారంభించారు. మహిళలకు వడ్డీలేని రుణాలు పక్క జిల్లాకు నిర్మల్‌కు రూ. 22 కోట్లు మంజూరు చేస్తే, ఆదిలాబాద్ జిల్లాకు కేవలం రూ. 8 కోట్లు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఎంపీడీవో సత్యనంద్, కుంర సత్యవతి కోటేశ్, కృష్ణారెడ్డి, నిమ్మల ప్రీతం రెడ్డి, గాడ్గే సుభాష్, ముండే పాండురంగ్, లోక శిరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్ వద్ద గల ఆలయంలో సోమవారం నిర్వహించిన శివాంజనేయ నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదపండితులు నమలికొండ సంతోష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.

రైతులను రెచ్చగొడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

బోథ్: యూరియా కొరత లేకున్నా బీఆర్‌ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి ధర్నా చేయిస్తున్నారని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ అన్నారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో మాట్లాడారు. సొనాల మండల కేంద్రంలో ఆదివారం ఆఫీస్ బంద్ ఉన్న సమయంలో కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు యూరియా కొరత ఉందంటూ ధర్నాలు చేయించారని ఆరోపించారు. చిల్లర రాజకీయాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లోలపు పోశెట్టి, ఆత్మ డైరెక్టర్ భోజన్న, రమేశ్‌రెడ్డి, సంజీవ్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బజార్‌హత్నూర్: 2025 జూన్ 5 వరకు కొత్త పట్టాపాసు పుస్తకం పొందిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు ఈనెల 13 వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో కృష్ణపాల్ తెలిపారు. గతంలో రైతు బీమా పొందిన రైతుల మార్పులు, చేర్పులకు ఈనెల 12 లోగా ఆయా క్లస్టర్ రైతువేదికల్లో సంబంధిత ఏఈవోలకు ధ్రువపత్రాలు అందజేయాలన్నారు.

ఇచ్చోడ: మండలంలోని రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో రమేశ్ తెలిపారు. నూతన పట్టా పాస్‌బుక్ పొందిన వారు ఈనెల 13లోపు సంబంధిత ఏఈవోల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అదే విధంగా గతంలో బీమా పథకంలో ఉన్న వారి నామిని ఇతర మార్పు కోసం ఈనెల 12లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కైలాస్‌నగర్: ప్రభుత్వం రైతులకు రూ.5 లక్షల రైతు బీమా చేయిస్తుందని, 18 నుంచి 59 సంవత్సరాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రైతులు నామిని, ఏదైనా మార్పులు చేసుకోవాలనుకుంటే మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



తిరంగా యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిపై విద్యార్థులు, బీజేపీ నాయకులు తిరంగా యాత్ర చేపట్టారు. బీజేపీ నాయకులు ఆరెల్లి రాజలింగు, దీపక్‌సింగ్ షెకవత్, కనక తుకారం, మారుతి దేవ్‌పూజే, ఆర్క ఖమ్ము, హెరేకుమ్ర అనిల్, కనక హన్మంత్‌రావు, గణేష్, కోవ రాజేశ్వర్, మెస్రం జైరాం పాల్గొన్నారు.

లంబాడితండాల్లో తీజ్ ఉత్సవాలు



గోదుమ నారుకు నీరు పోస్తున్న యువతులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు లంబాడితండాల్లో తీజ్ ఉత్సవాలను యువతులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు హర్కపూర్‌తండా, మచ్చపూర్, లాల్‌టేకిడి గ్రామాల్లో గ్రామ పొలిమేరలోని పుట్ట మట్టిని తీసుకువచ్చి, వెదురు బుట్టలో ఉంచి గోదుమ నారు నాటారు. నాటిన నారుకు ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో నీరు పోస్తున్నారు. ఈనెల 16న ఉత్సవాలను వైభవంగా ముగించనున్నట్లు లంబాడి సమాజ్ పెద్దలు తెలిపారు.

కల్యాణలక్ష్మితో ఆర్థిక ఉపశమనం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వమందించే ఆర్థికసాయం వారి తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, మావల మండలాల్లోని 141 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లెపూల నర్సయ్యతో కలిసి చెక్కులు అందజేశారు. దరఖాస్తుదారులకు త్వరితగతిన చెక్కులు అందేలా అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ కోవ ఇస్తారి, ఆర్ఐ యజువేందర్ రెడ్డి పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ కార్మికుల ఆందోళన

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎలా వండి వడ్డించాలని సంఘం రాష్ట్ర నాయకులు కుంటాల రాములు ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలంటూ ఆరు రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇందులో కార్మికులు శ్రీదేవి, శశికళ, పుష్పలత, రాంబాయి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని సీపీఎం ధర్నా

కైలాస్‌నగర్: బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కేంద్రం తీరును నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వ్యతిరేకత వ్యక్తం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాఘవులు, కిరణ్, బండి దత్తాత్రి, మంజుల, సురేందర్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



నేరడిగొండ: ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఉపాధ్యాయులు

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ ఆశ్రమోన్నత నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం మాత్రలు వేశారు. విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎస్ చరణ్‌దాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, వార్డెన్ వనిత పాల్గొన్నారు.

బోథ్: సొనాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు విద్యార్థులకు వైద్యులు నవీన్ రెడ్డి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్‌ఎం పావని, ఆశ కార్యకర్త పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థినులకు వైద్యాధికారి శ్రావ్య, ఎంఈవో శ్రీకాంత్, ఎంపీడీవో మోహన్ రెడ్డితో కలిసి మాత్రలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణేశ్ జాదవ్, కేజీబీవీ ప్రత్యేకాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: నులిపురుగులు లేని సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే జితేందర్, వైద్యురాలు పూజిత, ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీంపూర్: 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈవో శ్యాంసుందర్, వైద్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, ప్రత్యేకాధికారి రజిని, హెచ్‌ఎం కాంచన, పర్యవేక్షకులు రుహిదాస్, మేఘ, తదితరులు పాల్గొన్నారు.



బోథ్: మాత్రలు వేస్తున్న వైద్యులు నవీన్‌రెడ్డి



తాంసిలో..

క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి సుమలత అన్నారు. రిమ్స్‌లో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారంతో కూడిన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. అనుమానితులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్, ఇమ్రాన్‌ఖాన్, ఖలీల్, జావిద్, హఫీజ్, సమీర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నమూనా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్ధిదారులకు నిర్మాణ పనులు సూచించిన సమయంలో పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టిన వారికి సకాలంలో బిల్లులు చెల్లించేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు



రక్షాబంధన్ గురించి వివరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు పాఠశాలల్లో వేడుకలను జరిపారు. విద్యార్థులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ నిఖిల్ మాట్లాడుతూ రక్షాబంధన్‌తో సోదర, సోదరీమణుల భావం పెంపొందుతుందన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.